

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్, అక్టోబర్ 3 : ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల ప్రవర్తనా నియమావళి)ను అమలుపరిచే ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, సర్వైవల్ స్టాటస్టికల్ టీమ్, వీడియో సర్వైవల్, వీవింగ్ టీమ్‌లకు సంబంధించిన పరిశీలకులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల అధికారులు శిక్షణ పొంది, ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ఎన్నికల మార్గదర్శకాలను సంపూర్ణంగా అధ్యయనం చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరూ అతిక్రమించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించేలా ఈ రోజు నుంచే ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నియోజకవర్గాలు, మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. రిపోర్టులను సకాలంలో సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్, టాయ్‌లెట్లు వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు అంతా కమిషన్ ఆధీనంలోనే పనిచేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

## ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

### గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 3 : రాబోయే ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని గ్రేటర్ కమిషనర్, తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లో నియోజకవర్గం సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు విధులను నిబద్ధతతో సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలపై నివేదిక అందజేయాలన్నారు. ఎన్నికలకు ముందే పోలింగ్ స్టేషన్లలో పనులను పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రం వారీగా కమ్యూనికేషన్ సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు వెళ్లడానికి రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందిని కేంద్రాలకు తీసుకువెళ్లేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల నియామావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు.వివాదాలకు తావివ్వకుండా సిబ్బంది సమష్టిగా విధులు నిర్వర్తించాలని సూచించారు. బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి, తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

## కేడీసీలో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన సదస్సు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3 : ఓటింగ్ శాతం పెంచడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయవచ్చని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటింగ్ ప్రక్రియపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ కులం, మతం, వర్గం, డబ్బు, మద్యానికి లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎం హరిప్రసాద్ సీ విజిల్ యాప్ ద్వారా ఎలా ఫిర్యాదు నమోదుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ రాజారెడ్డి విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. రాజనీతి అధ్యాపకుడు ఏ మధుసూదన్‌రెడ్డి ఎలక్షన్ కమిషన్ విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ సైనాదేవి, డాక్టర్ ఎం రాంబాబు, అధ్యాపకులు కమలాకర్, మురళి, సోమనర్సయ్య, లీలావతి, రమ, మాధవి పాల్గొన్నారు.

# మున్నూరుకాపు భవన నిర్మాణానికి రూ.5.5 కోట్లు

- ఈ నెల 6న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్, అక్టోబర్ 3 : మున్నూరుకాపు భవన నిర్మాణానికి రూ5.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఈ నెల 6న నగరానికి వస్తున్న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తానని ఆయన తెలిపారు. మంగళవారం 11వ డివిజన్ పరిధిలోని మున్నూరుకాపు భవన్‌లో ముఖ్యనాయకుల సమావేశంలో చీఫ్‌విప్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 40 ఏళ్ల నుంచి మున్నూరుకాపు కులబాంధవులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. కార్యకర్త స్థాయి నుంచి శాసన సభ్యుడిగా ఎంపికయ్యాయన్నారు. సంఘం బలోపేతానికి నాయకులు కృషి చేయాలని సూచించారు. సంఘం భవన నిర్మాణానికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. కులస్తులకు అందరికీ ఉపయోగపడేలా భవన నిర్మాణం ఉంటుందన్నారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు కటకం పెంటయ్య, కనుకుంట్ల రవికుమార్, పేరుకాని శ్రీధర్, మాందాటి మనోజ్, పూజారి సత్యనారాయణ, తోట నవీన్‌కుమార్, తిరుపతయ్య, గైనేని రాజన్, కుంభంపాటి కుమారస్వామి, వేల్పుల మోహన్‌రావు, మాడిశెట్టి శివశంకర్, పుప్పాల ప్రభాకర్, మిద్దెల బాబు, చెన్నం మదు, తోట వెంకటేశ్వర్లు, సిద్దం రాజయ్య, సృజన్‌కాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

# ప్రారంభానికి సిద్ధమైన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్

- రూ.7.5 కోట్లతో నిర్మాణం పూర్తి
- 6న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- చీఫ్ విప్ వినయ్‌భాస్కర్



ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్,అక్టోబర్ 3 : రోడ్లు, భవనాల శాఖకు చెందిన గెస్ట్‌హౌస్‌ను మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ నెల 6న నగర పర్యటకు వస్తున్న మంత్రి కేటీఆర్ హనుమకొండలో రూ.7.5 కోట్లతో నిర్మించిన గెస్ట్ హౌస్‌ను ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నూతనంగా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను చీఫ్‌విప్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెస్ట్ హౌస్‌ను జీప్లస్ త్రి అంతస్తులతో నిర్మించామన్నారు. ఆధునిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు. కాగా, చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్‌ను ఓరుగల్లు ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ నూతన కమిటీ బాధ్యులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మండల్ నరేశ్ వాల్మీకిని చీఫ్ విప్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రాజమౌళి, సంతోష్, రాజేందర్, కుమారస్వామి, హరిప్రసాద్, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూడండి.. ఆశీర్వదించండి

- రూ.19వేల కోట్ల రుణం మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దే
- ఈటల గెలిచి రెండేళ్లయిన తట్టెడు మట్టిపోయలే
- విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- కమలాపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కన్నూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని గూడూరు, కన్నూరు, శంభునిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఏరాష్ట్రంలో చేయని విధంగా రైతులకు రూ.19వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. 'స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఏడుసార్లు అవకాశం ఇచ్చారు. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి.. అభివృద్ధి చేస్తానో లేదో తెలుస్తుంది' అని అన్నారు. ఈటల రాజేందర్ బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచి రెండేళ్లయినా మండలంలో తట్టెడు మట్టి కూడా పోయలేదన్నారు. అదే తాను ఎమ్మెల్సీ అయ్యాక రూ.కోట్ల నిధులు తీసుకొచ్చి మండలాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు నిర్మించాకే ఓటు అడుగుతానని చెప్పి వాటిని పూర్తి చేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్‌లాంటి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి కేసీఆర్ అండగా నిలిచారన్నారు. మూడు నెలల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. బీసీలందరికీ రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించి, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే ప్రజలకు లాభం జరుగుతుందన్నారు. గూడూరులో రూ.8కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు, కన్నూరులో రూ.18కోట్ల నిధులతో జరిగిన పనులను ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో గ్రామంలో రూ.లక్ష పని కావాలంటే సర్పంచ్‌లు చాలా ఇబ్బంది పడేవారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుతం రూ.కోట్ల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారంటే కేసీఆర్ పనితీరుకు ఇదే నిదర్శనమన్నారు. తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో తొలి విజయం హుజురాబాద్‌దే అని ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే కమలాపూర్‌ను మున్సిపాలిటీగా చేసి, గూడూరులో స్టేడియం, ఉప్పల్, శనిగరం గ్రామాలను మండలాలు చేస్తానని ప్రకటించారు. కాగా, గూడూరులో నూతన గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘాల నూతన భవనం, పద్మశాలి సంఘం భవనం, కన్నూరులో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, మహిళా భవనాన్ని ప్రారంభించారు. అలాగే, రూ.1.50 కోట్లతో సమ్మక్క గద్దెల వరకు సీసీ రోడ్డు నిర్మాణ శంకుస్థాపన చేసి, రూ.3.75కోట్లతో వాగుపై నిర్మించిన బ్రిడ్జితోపాటు గ్రామంలో సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే, శంభునిపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లూరి రాంచందర్‌రావు, అంకతి సాంబయ్య, పెండ్యాల రవీందర్‌రెడ్డి, ఎంపీపీ తడక రాణి, జడ్పీటీసీ లాండిగ కల్యాణి, ఎంపీటీసీలు వీరమనేని భాస్కర్‌రావు, పాక లక్ష్మి, శైలజ, సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణరావు, ఎంపీడీవో పల్లవి, ఎంపీవో విమల, ఏపీఎం నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు, గ్రామస్తులు